‘ఫ్యూజ్ ఆఫ్ కాల్’ను సద్వినియోగం చేసుకోండి


ఫ్యూజ్ ఆఫ్ కాల్ వివరాలు తెలుపుతున్న విద్యుత్ శాఖ ఈఈ చంద్రశేఖర్ రెడ్డి

రాజంపేట రూరల్ : డివిజన్‌లోని విద్యుత్ వినియోగదారులు ఫ్యూజ్ ఆఫ్ కాల్‌ను సద్విని యోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) ఆర్.చంద్రశేఖర్ రెడ్డి కోరారు. స్థానిక డివిజినల్ విద్యుత్ శాఖ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. రాజంపేట, రైల్వేకోడూరు, ఒంటిమిట్ట సబ్ డివిజన్‌ల పరిధిలో ఫ్యూజ్ ఆఫ్ కాల్స్ సెంటర్స్ అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు. పట్టణ, మండల హెడ్ క్వార్టర్స్ ప్రాంతాలలో విద్యుత్ అంతరాయం, ఇతర విద్యుత్ సమస్యలపై పరిష్కారానికి సమాచారం అందించాలన్నారు.

- రాజంపేట పట్టణ, సౌత్ ఏఈ(9440811967), రాజంపేట సబ్ స్టేషన్ ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్(9490615205).. దీని పరిధిలో పాతబస్టాండ్, డీబీఎన్ పల్లి, నూనెవారిపల్లి, వైబీఎన్ పల్లి, జీఎంసీ క్లబ్, బలిజపల్లి రోడ్డు, ఎస్‌వీ నగర్, సాతుపల్లి, బలిజపల్లి దళితవాడ, గాంధీనగర్, ఆర్‌ఎస్ రోడ్డు. సరస్వతీపురం సబ్ స్టేషన్ ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్(8331089969).. దీని పరిధిలో సరస్వతిపురం, జానీబాషాపురం, టి.అగ్రహారం, టీచర్స్ కాలనీ, భవానీ నగర్.
- రాజంపేట పట్టణం నార్త్ ఏఈ(9491052941) మన్నూరు సబ్ స్టేషన్ ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్(8331011826).. దీని పరిధిలో మన్నూరు, బ్రాహ్మణ వీధి, గొల్లపల్లి, సాయి నగర్, ఎర్రబల్లి, శివాజీ నగర్, ఉస్మాన్ నగర్, మార్కెట్, బండ్రాళ్ల వీధి, బైపాస్ రోడ్డు, నూనెవారిపల్లి రోడ్డు, సుద్ద గుంతలు, రెడ్డివారి వీధి, వైఎస్సార్ నగర్, రామ్ నగర్, బోయపాళెం, ఈడిగపాళెం, పాట్టి శ్రీరాముల వీధులలో నివసించేవారు సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చన్నారు.
- తాళ్లపాక సబ్ స్టేషన్ ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్ (9490615208), రాజంపేట పట్టణం నార్త్ ఏఈ(9491052941) దీని పరిధిలో కె.బోయినపల్లి, తాళ్లపాక, ఎస్ ఎర్రబల్లి.
- పుల్లంపేట ఏఈ(9440811969) దళవాయిపల్లి సబ్ స్టేషన్ ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్(8332958496).. దీని పరిధిలో పుల్లంపేట మెయిన్ రోడ్డు, బైపాస్ రోడ్డు, శివాలయం వీధి, గాంధీనగర్.
- పెనగలూరు ఏఈ(9440811968) కంబాలకుంట సబ్ స్టేషన్ ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్(9490615213) దీని పరిధిలో పెనగలూరు, ఇండ్లూరు, కొత్తపల్లి, కేసీపల్లి.
- రైల్వే కోడూరు ఏఈ(9440811976), రైల్వేకోడూరు సబ్ స్టేషన్ ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్(9490615216) దీని పరిధిలో అంకమ్మ నగర్, రంగనాయకులపేట, కోడూరు టౌన్, మెయిన్ రోడ్డు, ధర్మాపురం, అంబేద్కర్ నగర్.
- మ్యాంగోయార్డు సబ్ స్టేషన్ ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్(8332999165), దీని పరిధిలో వినాయక నగర్, మ్యాంగో యార్డు, తిరుపతి రోడ్డు, మైసూరు వారిపల్లి, ఆర్‌ఎస్ రోడ్డు, శెట్టిగుంట, లక్ష్మిగారిపల్లి.
- ఓబులవారిపల్లి ఏఈ(9440811978).. కొర్లకుంట సబ్ స్టేషన్ ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్(9490615219) దీని పరిధిలో ఓబులవారిపల్లి, సంజీవపురం.
- చిట్వేలి ఏఈ(9440811975), చిట్వేలి సబ్ స్టేషన్ ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్(9490615221) దీని పరిధిలో చిట్వేలి మెయిన్ రోడ్డు, బ్రాహ్మణ వీధి, బస్టాండ్, సింగనమల వీధి, జెండా వీధి, తోపు వీధి, అంబేద్కర్ సర్కిల్.
- ఒంటిమిట్ట ఏఈ(9440811971), ఒంటిమిట్ట సబ్ స్టేషన్ ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్(7901627294) దీని పరిధిలో ఒంటిమిట్ట మెయిన్ రోడ్డు, రామాలయం వీధి, ఉప్పరపల్లి, మల్లేశ్వరీ పురం, సరస్వతిపురం, మహబూబ్‌నగర్.
- నందలూరు ఏఈ(9440811972), ఆల్విన్ సబ్ స్టేషన్ ఫ్యూజ్ కాల్ సెంటర్(9490615224) దీని పరిధిలో నాగిరెడ్డిపల్లి, అరవపల్లి, బస్టాండ్, సౌమ్యనాథస్వామి వీధి, టంగుటూరు రోడ్డు, గొల్లపల్లి, నీలిపల్లి, ఇసుకపల్లి, కుమ్మరపల్లి.
- సిద్దవటం ఏఈ(9440811973), సిద్దవటం ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్(9490615226) దీని పరిధిలో సిద్దవటం మెయిన్ రోడ్డు దిగువపేట, వెలుగుపల్లి, జంగాలపల్లి, కమ్మపల్లి, వన్‌తాటిపల్లి, జ్యోతి, గొల్లపల్లి, కొత్తపల్లి, పాన్నూరు, వెంకటాయిపల్లి పరిధిలోని ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను తెలియజేయవచ్చని తెలియజేశారు.

ఆలయ పునర్నిర్మాణానికి ఎంపీ మిథున్‌రెడ్డి విరాళం


ఎంపీ మిథున్‌రెడ్డిని కలిసిన ఆలయ కమిటీ సభ్యులు

గాలివీడు : మండల కేంద్రంలోని పెద్దూరు బ్రాహ్మణవీధిలో వెలసిన శ్రీ వారి ఆలయ పునర్నిర్మాణ నిమిత్తం రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి రూ.లక్ష విరాళాన్ని అందించినట్లు కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. గత మాసంలో ఎంపీని కలిసిన కమిటీ సభ్యులు విషయాన్ని, ఆలయ పూర్వాపరాలు తెలియజేయగా మిథున్‌రెడ్డి రూ.లక్ష విరాళంగా ప్రకటించారన్నారు. నగదును శనివారం తిరుపతిలో ఆయన కార్యాలయంలో కమిటీ సభ్యులకు అందజేశారు.

ఘనంగా శ్రీకృష్ణ ఆలయ వార్షికోత్సవం

మదనపల్లె సిటీ : అనపగుట్టలో వెలసిన గోవర్ధనగిరి శ్రీకృష్ణ ఆలయం మొదటి శనివారం వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఆలయంలో ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ

సిద్దవటం : మండల కేంద్రంలోని పశు వైద్యశాల అసిస్టెంటు డైరెక్టర్‌గా డాక్టర్ లక్ష్మీదేవి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న వెటర్నరీ అసిస్టెంటు డైరెక్టర్ డాక్టర్ సుబ్బరాయుడు కడపకు బదిలీ కావడంతో చింతకొమ్మదిన్నె మండలంలో పనిచేస్తున్న డాక్టర్ లక్ష్మీదేవి సిద్దవటంకు బదిలీపై వచ్చారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాడి పశువుల రైతులకు ఎల్లవేళల అందుబాటులో ఉంటానని ఆమె తెలియజేశారు.

ఎంపీడీఓగా సూర్యనారాయణరెడ్డి

రామాపురం : మండల ఎంపీడీఓగా సూర్యనారాయణరెడ్డి బాధ్యతలను శనివారం చేపట్టారు. ముద్దనూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై ఎంపీడీఓగా రామాపురానికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీఓ హైదర్‌వలి చక్రాయపేట ఎంపీడీఓగా బదిలీపై వెళ్లారు. మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

వేసవి సెలవులను పొడిగించాలి


మాట్లాడుతున్న కోటేశ్వరరావు

రాయచోటి అర్బన్ : విద్యార్థుల వేసవి సెలవులను పొడిగించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని వేసవి సెలవులను మరో 10 రోజుల పాటు పొడిగించాలన్నారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నేతలు నారాయణ, లోకేష్, నందు, హేమంత్‌లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అంకాలమ్మకు పూజలు


పూజలందుకున్న అంకాలమ్మ

సిద్దవటం : ఎస్‌కేఆర్ నగర్ ఎస్సీ కాలనీలో అంకాలమ్మ తిరునాల సందర్భంగా శనివారం అమ్మవారికి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అంకాలమ్మకు కపిర తీయుట, సాయంత్రం జల్దిలో అంకాలమ్మ ముగ్గు వేసి రాజులను రతనాలను చేసి కొలువులు అందించుట వంటి పూజలు నిర్వహించారు. తరువాత అంకాళమ్మ ఊరేగింపు నిర్వహించారు. ఆదివారం ఆలయం వద్ద సిద్ధయాగం, తీర్థప్రసాదాలు, మధ్యాహ్నం అమ్మవారి గుడిచుట్టూ సుడిబండ్లు, బోనాల సమర్పణ, వంటి పూజలు జరుగనున్నాయి. సాయంత్రం బండలాగుడు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయనున్నారు.

లక్ష్మీనృసింహుడికి ప్రత్యేక పూజలు

చిన్నమండెం : మండెం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం కావడంతో మూలవిరాట్‌మూర్తిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. సమీప ప్రాంతాల భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

లక్కిరెడ్డిపల్లెలో..

లక్కిరెడ్డిపల్లె : రాయచోటి–వేంపల్లి రహదారి మార్గంలోని మర్రిచెట్టు వద్ద వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అర్చకులు వెంకటనారాయణ శాస్త్రి ఆధ్వర్యంలో స్వామివారికి పూజలు నిర్వహించారు.

ఎస్సీ రైతులకు స్ప్రేయర్లు పంపిణీ

రామాపురం : మండలంలోని బండపల్లి పంచాయతీలోని బయనేనిపల్లి దళితవాడకు చెందిన 10 మంది ఎస్సీ రైతులకు శనివారం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు శిల్పకళ ఆధ్వర్యంలో స్ప్రేయర్లు పంపిణీ చేశారు. వ్యవసాయం చేస్తున్న రైతులకు ఉచితంగా ప్రభుత్వం స్ప్రేయర్లను అందించడం జరుగుతుందన్నారు. తక్కువ సమయంలోనే ఎక్కువ పంటలను సాగు చేయడం జరుగుతుందన్నారు. పంట సాగు చేసి పిచికారీ చేయడానికి రైతులకు ఈ స్ప్రేయర్లు పంపిణీ చేశామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల యాంకర్ వెంకట్రామిరెడ్డి, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

ఒంటిమిట్ట : మంటపంపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన ఉచిత కంటివైద్య శిబిరాన్ని విశేష స్పందన లభించిందని ఎస్ఎస్ఆర్ ఫౌండేషన్ అధినేత శంకర్‌రెడ్డి తెలిపారు. చింతరాజుపల్లె, మంటపంపల్లె, కొనరాజుపల్లె పంచాయతీలలోని ప్రజలకు శ్రీ వేంకటేశ్వర అరవింద్ ఆసుపత్రి తిరుపతి వారి ఆధ్వర్యంలో కంటివైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు నిర్వాహకుడు పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరంలో 170మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి పొర, కంటి శుక్లం ఉన్న వారికి ఉచిత ప్రయాణం, భోజన వసతి సౌకర్యంతో పాటు ఉచిత కంటి ఆపరేషన్‌లు నిర్వహిస్తామని చెప్పారు. గతంలో ఆపరేషన్ చేయించుకున్నవారికి మరలా ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులను అందజేసినట్లు పేర్కొన్నారు.

అంగన్‌వాడీ వ్యవస్థ బలోపేతానికి కృషి


నియామకపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే మేడా

రాజంపేట : అంగన్‌వాడీ వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. శనివారం ఎమ్మెల్యే కార్యాలయంలో నూతనంగా నియమితులైన అంగన్‌వాడీలకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీ సెంటర్లను అభివృద్ధి చేశారన్నారు. పిల్లలకు, గర్భిణులకు పౌష్టికాహారం అందించేలా కార్యక్రమాలను తీసుకొచ్చారన్నారు. ఆరోగ్యకరమైన రీతిలో చిన్నారులు ఉండాలనే తలంపుతో అంగన్‌వాడీలను పటిష్టంగా తీర్చిదిద్దారన్నారు. కార్యక్రమంలో సిద్దవటం జెడ్పీటీసీ శ్రీకాంత్‌రెడ్డి, నందలూరు జెడ్పీటీసీ గడికోట ఉషాసుబ్బారెడ్డి, పార్లమెంటరీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు పసుపులేటి సుధాకర్, మాజీ సర్పంచ్ ముమ్మడి మదన్‌రెడ్డి, జిల్లా వక్ఫ్ బోర్డు సెక్రటరీ సయ్యద్ అమీర్, నందలూరు కో–ఆప్షన్ సభ్యుడు కలీం, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ జనరల్ సెక్రటరీ నడివీధి సుధాకర్, జిల్లా ఎస్సీ సెల్ విజిలెన్స్ మానటరింగ్ కమిటీ సభ్యుడు సత్యాల రామకృష్ణ, సిద్దవటం పార్టీ కన్వీనరు నీలకంఠారెడ్డి, జేఏసీ కన్వీనరు రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి ఆర్థికసాయం అందజేత


చెక్కును అందజేస్తున్న ముక్కా రూపానందరెడ్డి

ఓబులవారిపల్లె : మండల పరిధిలోని బొమ్మవరం గ్రామానికి చెందిన పేద విద్యార్థి పి.నితిన్ అనే విద్యార్థికి చదువుల నిమిత్తం ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ ద్వారా అధ్యక్షుడు ముక్కా రూపానందరెడ్డి ఆర్థిక సహాయాన్ని అందించారు. బొమ్మవరం గ్రామానికి చెందిన పి.మునలయ్య గల్ఫ్ దేశంలో గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో ఆయన కుటుంబం ఆర్థికంగా చాలా ఇబ్బందులను ఎదుర్కొంటోంది. దీంతో రూపానందరెడ్డి స్పందించి మృతుడి పిల్లల చదువుల నిమిత్తం ఫౌండేషన్ ద్వారా రూ. 60 వేలు చెక్కును నితిన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా బొమ్మవరం గ్రామస్తులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి సాయివికాష్ రెడ్డి, వైస్ ఎంపీపీ గూడూరు గౌరీశంకర్ రాజు, డీఆర్‌యూసీసీ మెంబర్ తల్లెం భరత్‌కుమార్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బొమ్మవరం నారాయణ రెడ్డి, బత్తిన వేణుగోపాల్ రెడ్డి, తల్లెం విష్ణువర్ధన్ రెడ్డి, సర్పంచ్ అరవ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రంగపూర్ అంటు.. దిగుబడికి మెట్టు

- రైల్వేకోడూరులో అధికంగా ఉత్పత్తి చేస్తున్న నర్సరీలు
- ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి కొనుగోలు చేస్తున్న రైతులు


ఎగుమతికి సిద్ధమైన మొక్కలు

రైల్వేకోడూరు అర్బన్ : చీని, నిమ్మ రైతులు చెట్లను నాటే సమయంలో రంగపూర్ మొలకలపై కట్టిన చీని, నిమ్మ అంట్లను నాటుకోవడంతో రైతులకు ఎంతో మేలు చేస్తుంది. రైల్వేకోడూరు మండలంలోని రాఘవరాజపురం, చిట్వేలి రోడ్డులోని పలు నర్సరీలు రంగపూర్ అంట్లను ఉత్పత్తి చేస్తున్నాయి. ఇక్కడి నుంచి ప్రతి ఏడాది పెద్ద ఎత్తున వ్యాపారం నిర్వహిస్తుంటారు. తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర, తెలంగాణ తదితర ప్రాంతాలతోపాటు రాష్ట్రంలోని కర్నూలు, అనంతపురం, నెల్లూరు, గుంటూరు జిల్లాల నుంచి రైతులు, వ్యాపారులు ఇక్కడకు వచ్చి నర్సరీలలో నాణ్యమైన మొక్కలు తీసుకెళ్తుంటారు. ఈ మొక్కలు ఒకటి 80 రూపాయల నుంచి 120 రూపాయల వరకు అమ్ముతుంటారు. రంగపూర్ అంట్లు నాటినప్పటి నుంచి తెగుళ్లను తట్టుకుని ఎక్కువ కాలం పంటను ఇవ్వడానికి వీలుంటుంది. అలాగే రైతులు రంగపూర్ అంట్లను నాటే ముందు రైతులు ఉద్యానశాఖ అధికారుల సలహాలు తీసుకుని సాగు చేస్తే సుమారు 30 సంవత్సరాలకు చెట్లు మన్నిక సాధిస్తాయని అధికారులు అంటున్నారు. తక్కువ నీటితో తెగుళ్లు లేకుండా రైతులకు మంచి ఫలితాన్ని ఇస్తాయి. ఇక్కడ ప్రతి ఏటా లక్షల సంఖ్యలో ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. రైతులు ఇతర అంట్లను నాటకుండా కేవలం రంగపూర్ మొలకల మీద కట్టిన అంట్లను వాడుకోవడం ఎంతో శ్రేయస్కరమని అధికారులు తెలియజేస్తున్నారు.

‘లోకేష్‌ది పాదయాత్ర కాదు ఈవినింగ్ వాక్’

- ఎమ్మెల్యే మేడా, జెడ్పీ చైర్మన్ ఆకేపాటిలను విమర్శించే స్థాయి లోకేష్‌కు లేదు

సిద్దవటం : యువగళం పాదయాత్రకు జనాదరణ లేకపోవడంతో ఇరుకు సందుల్లో సభలు పెడుతూ జనాలు వచ్చినట్టు చూపించుకుంటున్నారని సిద్దవటం జెడ్పీటీసీ ఉపాసి శ్రీకాంత్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యేలపై నారా లోకేష్ చేసిన ఆరోపణలకు కౌంటర్‌గా ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. సమస్యలు తెలుసుకుంటానని పాదయాత్ర మొదలుపెట్టిన నారా లోకేష్ దాన్ని కాస్త ఈవినింగ్ వాక్‌లా మార్చారని ఆరోపించారు. టీడీపీ చేసిన అభివృద్ధి చెప్పేందుకు ఏమీలేక రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డిలను విమర్శించేందుకే సభా సమయం సరిపోయిందన్నారు. మేడాపై సిద్దవటంలో చేసిన ఏ ఒక్క ఆరోపణనైనా నిరూపించగలరా? అంటూ ప్రశ్నించారు. దోపిడీదారులకు టీడీపీ హయాంలో అగ్రతాంబులం ఇచ్చారన్నారు. మేడా సొంత నిధులతో అనేకులను ఆదుకున్నారని గుర్తు చేశారు. ఎవరో రాసిచ్చింది చెప్పడం లోకేష్ మిడిమిడి జ్ఞానానికి నిదర్శనమన్నారు. 2014 టీడీపీ మేనిఫెస్టోను పార్టీ వెబ్‌సైట్ నుంచి తీసేసిన దౌర్భాగ్యపు పరిస్థితి ఏ పార్టీకు లేదని తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించి అధికారంలోకి రాగానే హామీలను నేరవేరుస్తూ వచ్చామన్నారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, మండల యూత్ కన్వీనర్ క్రిష్ణచైతన్య, ఎంపీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి, ఉప సర్పంచ్ ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురికి గాయాలు

రాయచోటి టౌన్ : వేర్వేరు రోడ్డు ప్రమాదాలలో ఏడుగురికి గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం రాత్రి రాయచోటి – సుండుపల్లె రోడ్డులోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయం వెనకాల శిబ్యాల నుంచి బేల్దారి పని ముగించుకొని రాయచోటికి వస్తున్న పి.నాగయ్య అనే వ్యక్తి ఎదురుగా వస్తున్న ఓ అమ్మాయిని (స్కూటీలో వస్తున్న అమ్మాయి) తప్పించబోయి కిందపడ్డాడు. దీంతో తలకు గాయం కావడంతోపాటు ఎడమ కాలు విరిగింది. చికిత్స నిమిత్తం రాయచోటికి తరలించారు.
అలాగే రాయచోటి – వీరబల్లె రోడ్డులోని దిగువ అబ్బవరం దాటుకొని ఇందుకూరుపల్లెకు వెళ్లే మలుపు వద్ద ఆటో బోల్తా పడింది. ఈ సంఘటనలో నాగార్జున, జలజ, సుమతి, ఆదెమ్మ, జ్యోతి, శ్రీదేవి అనే ఆరుగురికి గాయాలయ్యాయి. వీరిని 108 ద్వారా రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. స్థానిక వైద్యులు ప్రాథమిక చికిత్స చేసి కడప రిమ్స్‌కు తరలించారు. పోలీసులు జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పథకాలకు వలంటీర్లు బ్రాండ్ అంబాసిడర్లు

- అవినీతికి ఆస్కారం లేకుండా ఉండేందుకే వలంటీర్ వ్యవస్థ
- వలంటీర్లకు వందనంలో పాల్గొన్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి


వలంటీర్‌ను సత్కరించిన ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

సంబేపల్లె : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన సచివాలయ వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని అన్నమయ్య జిల్లా వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో వలంటీర్లకు వందనం కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే జి.శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఎంపీపీ నాగశ్రీలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఉత్తమ వలంటీర్లకు సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర వారి సేవలను గౌరవిస్తున్నామన్నారు. వలంటీర్లకు అవార్డులను అందజేయడం ఆనందంగా ఉందన్నారు. వివక్షత, అవినీతికి తావులేకుండా వలంటరీ వ్యవస్థ మరింత బాధ్యతగా పని చేయాలన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందివ్వాలన్నారు.
ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి టీడీపీని చంద్రబాబు లాక్కున్నారన్నారు. అదే వైఎస్‌జగన్ ప్రజలకు ఇచ్చిన మాట కోసం సోనియా గాంధీని ఎదిరించి సొంతంగా పార్టీ పెట్టి ప్రజల అభిమానాలతో అధికారంలోకి వచ్చారన్నారు. వలంటీర్లకు అండగా ఉంటానని, రాబోయే రోజులలో వలంటీర్లకు మంచి భవిష్యత్తు ఉందని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు.

ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టాలి..

జగన్ ప్రభుత్వానికి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక దుష్టచతుష్టయాలు, పచ్చ పత్రికలు, ఎల్లో మీడియా అనవసరంగా బురదజల్లుతోందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 98 శాతం పైగా నెరవేర్చామన్నారు. పాలకుడు బలవంతుడైతే శత్రువులు ఏకమవుతారన్నారు. చంద్రబాబు, ఎమ్మెల్యేగా గెలవలేని పవన్, రామోజీరావు, రాధాక్రిష్ణలు పన్నుతున్న కుట్రలు, కుతంత్రాలు సీఎం జగన్‌ను ఏమి చేయలేవన్నారు.

వలంటీర్లకు ఏడాది గౌరవ వేతనాన్ని అందించిన ఎంపీపీ

మండలంలోని గ్రామాలలో సేవలందిస్తున్న వలంటీర్లకు ఎంపీపీ నాగశ్రీలక్ష్మి తనకు వచ్చిన ఏడాది గౌరవ వేతనాన్ని మండలంలోని 181 మంది వలంటీర్ల జాబితాను తయారుచేసి డిప్ పద్ధతి ద్వారా ఎన్నికైన 12 మంది వలంటీర్లకు రూ. 60 వేల నగదును అందజేశారు. వలంటీర్లను ప్రోత్సహించిన ఎంపీపీని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి అభినందించారు. అనంతరం ఎమ్మెల్యేకు రాష్ట్ర కార్యదర్శి చిదంబరంరెడ్డి బుద్ధ విగ్రహాన్ని అందజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఉదయకుమార్‌రెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వాసుదేవరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ వడ్డి వెంకటరమణారెడ్డి, నాయకులు రమేశ్‌రెడ్డి, ఎంపీడీఓ నరసింములు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలి

రాయచోటి టౌన్ : రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి వైద్యులకు సూచించారు. శనివారం రాయచోటి పట్టణంలోని రాయచోటి – మదనపల్లె రోడ్డులో నూతనంగా సురక్ష మదర్స్ అండ్ చిల్డ్రెన్స్ ఆసుపత్రితోపాటు దేవి ప్రశాంతి ఆసుపత్రిని శ్రీకాంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రి నిర్వాహకులు నాణ్యమైన వైద్యం అందించాలని సూచించారు. అప్పుడే ప్రజల ఆశీస్సులు అందుతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఎక్కడిక్కడ వైద్యం అందించేందుకు పట్టణ ప్రాంతాలలో వైఎస్సార్ పట్టణ వైద్య కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాలలో వైఎస్సార్ గ్రామీణ వైద్య ఆరోగ్య కేంద్రాలు, ప్రతి పార్లమెంట్‌లో వైద్య కళాశాలలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

అన్నదానం

రామాపురం : అన్ని దానాల్లో అన్నదానం గొప్పదని లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ అధ్యక్షుడు మొహమ్మద్ అన్నారు. శనివారం మండలంలోని బండపల్లె సమీపంలోని ప్రేమాలయంలో వడ్డముడి వెంకట పుష్పతేజ్ నాయుడు 5వ వర్ధంతి సందర్భంగా తండ్రి రమేష్‌నాయుడు ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ పీఎస్ హరినాథ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు హరీష్‌చంద్, దాత కుటుంబ సభ్యులు ప్రశాంతి, ప్రణదీప్‌కుమార్ నాయుడు, మేనేజర్ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర డీఓపీకి సన్మానం


సుదర్శన్‌రెడ్డిని సన్మానిస్తున్న గాండ్ల సంఘం సభ్యులు

గాలివీడు : రాష్ట్ర డీఓపీ జిల్లా సుదర్శన్‌రెడ్డికి మండల గాండ్ల సంఘం ఆధ్వర్యంలో శనివారం ఆయన స్వగృహంలో ఘనంగా సన్మానించారు. గాండ్ల సంఘం సభ్యులు మాట్లాడుతూ సుదర్శన్‌రెడ్డి చిన్న వయస్సు నుంచే పట్టుదల, నమ్మకం కలిగిన వ్యక్తి అని, జిల్లా మరెన్నో ఉన్నతమైన పదవులు చేపట్టాలన్నారు. అనంతరం దుశ్శాలువా, గజమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గాండ్ల కులస్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

పెనగలూరు : మండలంలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీఓ వరప్రసాద్ కోరారు. ఈనెల 14వ తేదీలోపు అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని దరఖాస్తు ఫారాలను ఎంపీడీఓ కార్యాలయంలో అందజేయాలన్నారు. ఇంటర్వ్యూలు ఈనెల 16, 17వ తేదీలలో నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఎంపికైన వారికి 18న కాల్ లెటర్, 19న శిక్షణ, 20న పోస్టింగ్ ఆర్డర్ అందజేస్తామన్నారు.
కట్టావారిపల్లిలో మూడు వలంటీర్ పోస్టులు బీసీ జనరల్ – 1, ఎస్టీ మహిళ – 1, ఎస్టీ జనరల్ – 1, అలాగే సిద్ధవరంలో బీసీ మహిళ – 1, పొందలూరు ఓసీ మహిళ – 1 వలంటీర్ పోస్టు ఖాళీగా ఉన్నాయన్నారు.

నేడు మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

పెనగలూరు : మండలంలోని మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి పరీక్ష ఆదివారం జరుగనుందని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ సహజ బ్లెస్సి తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు మోడల్ స్కూల్‌లో జరుగనున్న పరీక్షకు విద్యార్థులు హాజరై పరీక్ష రాయాలని, మెరిట్ లిస్టు ప్రకారం విద్యార్థులను ఎంపిక చేస్తామని ఆమె అన్నారు.

లక్కిరెడ్డిపల్లెలో..

లక్కిరెడ్డిపల్లె : 2023 – 24 విద్యా సంవత్సరానికి సంబంధించి నేడు లక్కిరెడ్డిపల్లె ఏపీ మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి ఎంట్రెన్స్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్ష జరుగుతుందని, పరీక్షా కేంద్రానికి గంట ముందు విద్యార్థులు చేరుకోవాలని, పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టికెట్‌తోపాటు బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్, పరీక్ష ప్యాడ్‌తో పరీక్షకు హాజరుకావాలని సూచించారు.

నారా లోకేష్ ఓ స్క్రిప్ట్ రీడర్

ఒంటిమిట్ట: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా లోకేష్ ఆ పార్టీలో ఓ స్క్రిప్ట్ రీడర్ పాత్రను పోషిస్తున్నాడని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ కార్పొరేషన్ డైరెక్టర్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి ఘాటుగా విమర్శించారు. సిద్దవటం మండంలో శుక్రవారం జరిగిన యువగళం కార్యక్రమంలో నారా లోకేష్ కడప జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డిలపై చేసిన విమర్శలకు స్పందిస్తూ.. ప్రజల చేత తిరస్కరింపబడిన నారా లోకేష్ ప్రజాప్రతినిధులను విమర్శించడం ఆయన కుసంస్కారానికి నిదర్శనమన్నారు. ఆకేపాటి, మేడాలు లోకేష్‌లా దొడ్డిదారిలో పదవులు పొందలేదన్నారు. విమర్శించే ముందు స్థాయిని గుర్తు తెచ్చుకోని విమర్శించాలని హితవు పలికారు.